సాక్షి ప్రకాశం

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



జల్సాల కోసం బైకు దొంగతనాలు

జల్సాలకు అలవాటుపడి డబ్బుల కోసం బైకులు దొంగతనం చేస్తున్న ఆరుగురు ముఠా సభ్యుల్లో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో..



ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై టీడీపీ శ్రేణుల దాడి

ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దారికాచి టీడీపీ శ్రేణులు దాడి చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన జిల్లా జడ్జి, కలెక్టర్



హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి భారతి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్

ఒంగోలు అర్బన్: ఒంగోలుకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎన్ వెంకటేశ్వర్లును శనివారం ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఏ భారతి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో వివిధ తరహా పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై హైకోర్టు జడ్జికి వివరించారు. హైకోర్టు న్యాయమూర్తిని ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్, సీనియర్ న్యాయవాదులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎస్‌జీఎఫ్ 19 క్రీడా షెడ్యూలు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా షెడ్యూలును ఎస్‌జీఎఫ్ అండర్ 19 కార్యదర్శి చింపారెడ్డి శనివారం మీడియాకు విడుదలచేశారు. ఈనెల 24, 25 తేదీల్లో ఉదయం 10 గంటలకు యోగ, ఫెన్సింగ్, చదరంగం, బాక్సింగ్, జూడో, కరాటే, మాల్కం, జిమ్నాస్టిక్స్, బీచ్ వాలీబాల్ క్రీడాంశాలలో ఎంపిక ఉంటుంది. కందుకూరులో ఈనెల 26న అథ్లెటిక్స్, 27న హాకీ, హ్యాండ్‌బాల్, 28న క్రికెట్ క్రీడా జట్ల ఎంపిక నిర్వహిస్తారు. ఈనెల 27న స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో మోడరన్ పెంటాథ్లాన్, రగ్బీ, 28న సాఫ్ట్‌బాల్, షూటింగ్‌బాల్, 29న బేస్‌బాల్, 30న సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కబాడీ, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, తైక్వాండో, జె.పంగులూరు ఎంఎస్ఆర్ బీఎస్ఎం జూనియర్ కాలేజీలో ఉదయం 10 గంటలకు ఖోఖో పోటీల ఎంపిక చేస్తారు. ఈనెల 31న మిగిలిన అన్ని పోటీలకు ఏబీయం జూనియర్ కాలేజీలో క్రీడాజట్ల ఎంపిక ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఈదర చింపారెడ్డి, సెల్ నెంబర్ 9440621579 ను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు పాకల విద్యార్థులు ఎంపిక



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సింగరాయకొండ: పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో బాల, బాలికలకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల ఎంపికలో పది మంది బాలబాలికలు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య తెలిపారు. బాలికల విభాగంలో వీ హిందు, వీ దివ్య, వీ కుమారి, సీహెచ్ సంతోషి, ఎస్ వరలక్ష్మి, బాలుర విభాగంలో కే యశ్వంత్, బీ రేవంత్, సీహెచ్ కిషోర్, సీహెచ్ తిరుమల, వీ ప్రసన్నకుమార్ వివిధ కేటగిరీలో ఎంపికయ్యారన్నారు. ఈ పోటీలకు పాములూరు, చీరాల, కే బిట్రగుంట, కామేపల్లి, గవళ్లపాలెం, కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

'పొలం పిలుస్తుంది' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పక్కన జేడీఏ, ఇతర అధికారులు

ఒంగోలు సెంట్రల్: 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా శనివారం విడుదల చేశారు. ప్రతి మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు చెప్పారు.

బడుగు బతుకుల్లో మందు పాతర !

పశ్చిమ ప్రకాశంలో సారా భూతం మళ్లీ జడలు విప్పుతోంది. బెల్ట్ షాపులు ఊరూరా పుట్టగొడుగుల్లా వెలిశాయి. గడిచిన నాలుగైదేళ్లలో పల్లెల్లో మద్యానికి క్రమక్రమంగా దూరమైనవారు కూడా 'తప్పు'టడుగులు వేసే పరిస్థితులు దాపురించాయి. టీడీపీ–జనసేన–బీజేపీ అధికారం చేపట్టిన దరిమిలా బెల్టుబాబులు బుసకొడుతున్నారు. పల్లెలో మద్యం విక్రయాన్ని కూటమి నాయకులు, వారి అనుచరులు ఉపాధి వనరుగా మార్చుకున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పశ్చిమ ప్రకాశంలో నాటుసారా తయారీ, బెల్ట్ షాపులపై పోలీసులు, సెబ్ అధికారులు ఉక్కుపాదం మోపగా.. ప్రస్తుతం ఆ పరిస్థితులేవీ కనిపించడం లేదు.

- పశ్చిమ ప్రకాశంలో జోరుగా నడుస్తున్న బెల్టుషాపులు
- మండల కేంద్రాల నుంచి పల్లెలకు లిక్కర్ తరలింపు
- కూటమి నాయకులకు ఉపాధి వనరుగా మారిన బెల్టుషాపులు

మార్కాపురం: విచ్చలవిడిగా మద్యం దుకాణాలు తెరిచి బెల్ట్ షాపులను మరింత ప్రోత్సహించేందుకు కూటమి సర్కారు సర్వం సిద్ధం చేసింది. రాష్ట్రాన్ని 'నిషా' మైకంలోకి నెట్టి.. బడుగుల బతుకుల్లో 'మందు'పాతర పెట్టే పనిలో కూటమి కా'మందు' తలమునకలయ్యారు. దశలవారీగా మద్యం షాపులు తగ్గించి, ధరలు షాక్ కొట్టేలా చేస్తామని వైఎస్ జగన్ చెప్పిన మాటను అధికారంలోకి వచ్చాక ఆచరణలో పెడితే.. కల్లు తాగిన కోతుల్లా ఊగిపోయిన టీడీపీ కూటమి నేతలు.. అదే మద్యాన్ని అడ్డుపెట్టుకుని ఆదాయం పొందుతున్నారు. పల్లెల్లో బెల్టు షాపులు బార్లా తెరిచినా, నాటు సారా కాచినా అడిగేవాడు లేడన్న ధైర్యం.. అధికార మదంతో రెచ్చిపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పశ్చిమ ప్రకాశంలో పోలీసు, సెబ్ అధికారులు నాటుసారా తయారీపై ఉక్కుపాదం మోపగా కూటమి ప్రభుత్వం రాగానే అధికారులపై ఒత్తిడి తేవడంతో మళ్లీ అటవీ సమీప గ్రామాల్లో నాటుసారా తయారీ గ్రామాల్లో బెల్టుషాపు కేంద్రాలు వెలిశాయి.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపడంతో బెల్టుషాపులు లేవు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఒక వైపు బెల్టుషాపులు, మరోవైపు నాటుసారా బట్టీలు వెలిశాయి. అర్ధవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, కొమరోలు, పెద్దారవీడు, పొదిలి తదితర మండలాల్లోని లోయ గ్రామాల్లో బెల్టుషాపులతోపాటు నాటుసారా కూడా తయారవుతోంది. టీడీపీ నేతలు వేలం పాటలు పాడుకుని బెల్టుషాపులు ఏర్పాటు చేసుకుని మద్యాన్ని విక్రయిస్తున్నారు. మార్కాపురం, పొదిలి, కంభం, గిద్దలూరు పట్టణాల నుంచి కొనుగోలు చేసి బెల్టుషాపుల్లో విక్రయిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌పై ఉన్న ధరకంటే అదనంగా రూ.60 పెంచి విక్రయిస్తున్నారు.

మార్కాపురం పట్టణంలో ఇలా...

మార్కాపురం పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. మండలంలోని ప్రతి గ్రామంలో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు ఇద్దరు లేదా ముగ్గురు మద్యాన్ని బెల్టుషాపుల్లో అమ్ముతున్నారు. మార్కాపురం పట్టణం నుంచి ఆటోల్లో లిక్కర్ బాటిళ్లను తరలిస్తున్నారు. మండలంలోని నికరంపల్లి, బోడపాడు, రాయవరం, నాగులవరం, గజ్జలకొండ, చింతగుంట్ల, తిప్పాయపాలెం, యాచవరం తదితర గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా సెబ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారు. మార్కాపురం పట్టణంలోని బార్అండ్ రెస్టారెంట్లను ఉదయం 7 గంటలకే తెరవడంతో మందుబాబులు క్యూలో ఉంటున్నారు. సమయ పాలన పాటించకుండా అర్ధరాత్రి వరకూ రెస్టారెంట్లలో మద్యాన్ని విక్రయించడంతో పాటు మందుబాబుల కోసం ప్రత్యేక సిట్టింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. ప్రతి బార్అండ్ రెస్టారెంట్‌తోపాటు బెల్టుషాపుల నుంచి కూడా మామూళ్లు వసూలు చేయడంతో సెబ్ అధికారులు చూసి చూడనట్లు పోతున్నారు. చీప్‌లిక్కర్ తాగితే అనారోగ్యం పాలవడం ఖాయం. ఇప్పటికైనా సెబ్ ఉన్నతాధికారులు దృష్టి సారించి బెల్టుషాపులను నిరోధిస్తూ బార్అండ్ రెస్టారెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

- ఇటీవల గిద్దలూరు మండలం బురుజుపల్లి గ్రామంలో నాటుసారా స్థావరాలపై అధికారులు దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతోపాటు 20 లీటర్ల నాటుసారాను కూడా స్వాధీనం చేసుకున్నారు.
- రాచర్ల మండలం ఆకవీడు అటవీ ప్రాంతంలో ఇటీవల 4 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.
- ఈనెల 16న రాచర్ల మండలం రాచర్ల ఫాం సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 50 క్వార్టర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇవి నామమాత్రంగా జరిగిన దాడులే. ఇంకా పెద్ద ఎత్తున నాటుసారా విక్రయాలు, బెల్టుషాపులు యథేచ్ఛగా సాగుతున్నాయి.



వెలగలపాయలో నాటుసారా బట్టీ (ఫైల్)

పరివర్తనతో 150 మందికి ఉపాధి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాటుసారా నివారణకు పరివర్తన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో పలువురు ఈ వృత్తిని వదిలి జనజీవనంలో కలిసిపోయారు. వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు కలెక్టర్ బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించారు. దశాబ్దాలుగా సారానే వృత్తిగా చేసుకుని జీవిస్తున్న వారిలో మార్పు తెచ్చేందుకు జిల్లా పోలీస్ శాఖ 'పరివర్తన 2.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి సత్ఫలితాలు సాధించింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా నాలుగేళ్లలో సారాకు సంబంధించి 1400 మంది నిందితులను గుర్తించి అవగాహన కల్పించడంతోపాటు అనేక మందిని బైండోవర్ చేశారు. పద్ధతి మార్చుకోని వారిపై ప్రివెంటివ్ డిటెక్షన్(పీడీ) యాక్టు ప్రయోగించారు. కొంతమందిని గ్రామ బహిష్కరణ కూడా చేశారు. సారా రక్కసి నుంచి విముక్తి పొందిన 150 మందికి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించారు. వ్యవసాయంతోపాటు గొర్రెలు, మేకలు, గేదెల పెంపకం, ఆటోలు, బుట్టల అల్లకం తదితర ఉపాధి మార్గాలవైపు అడుగులు వేయించారు.



గిద్దలూరు మండలం బురుజుపల్లిలో నాటుసారా ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు (ఫైల్)

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో.. అక్రమార్కులపై ఉక్కుపాదం

జిల్లాలో అక్రమ మద్యం విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వివిధ సందర్భాల్లో పట్టుబడిన రూ.2.14 కోట్ల విలువైన మద్యాన్ని ఏడాది క్రితం అప్పటి ఎస్పీ మలికాగర్గ్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. మరోవైపు 97 గ్రామాలను నాటుసారా రహితంగా తీర్చిదిద్దారు. ప్రత్యేకంగా సెబ్ ఏర్పాటు చేసి నాటు సారా స్థావరాలు, మద్యం విక్రయ కేంద్రాలపై దాడులకు దిగారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నాలుగేళ్లలో మొత్తం 180 నాటుసారా కేసులు నమోదయ్యాయి. 504 మందిని అరెస్టు చేసి 42 వాహనాలను సీజ్ చేశారు. తయారు చేస్తున్న సారా బట్టీలను, 2,63,310 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. మొత్తం 5,227 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నల్ల బెల్లం అమ్ముతున్న 107 మంది వ్యాపారులను కూడా అరెస్టు చేశారు. ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్టు కింద ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. నలుగురిని గ్రామ బహిష్కరణ చేశారు.

ప్రభుత్వ భూమిపై పచ్చ గద్దలు



ఆక్రమించుకున్న రూ.2 కోట్ల విలువైన భూమి



భూమిలో రాళ్లను తొలగించిన దృశ్యం

- రూ.2 కోట్ల విలువైన 13.52 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ
- పడమరవీరాయపాలెంలో టీడీపీ కార్యకర్తల కబ్జాపర్వం
- యథేచ్ఛగా కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారుల మౌనం
- గతంలో జగనన్న కాలనీకి రూ.78 లక్షలతో రోడ్లు వేసి బాగుచేసిన స్థలం
- ఆ తరువాత ప్లాట్లు చాలక మరోచోట కేటాయింపు
- ఖరీదైన భూమి కావడంతో పెద్దల కన్ను

కురిచేడు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములపై పచ్చగద్దలు వాలిపోతున్నాయి. మమ్మల్ని అడ్డుకునేవారెవరంటూ యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. మండలంలోని పడమర వీరాయపాలెం గ్రామ సర్వే నంబర్ 60లో 13.52 ఎకరాల ప్రభుత్వ భూమి పై పెద్దల కన్ను పడింది. యథేచ్ఛగా ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు తమకేమీ తెలియనట్లు గుడ్లప్పగించి చూస్తున్నారు. ఈ భూమి ఐనవోలు మేజర్ కాలువను అనుకుని ఉండటం, సాగుకు అనుకూలంగా ఉండటం తోపాటు ఇక్కడ భూముల ధరలకు రెక్కలు రావడంతో భూమిపై అధికార పార్టీ కార్యకర్తల కన్ను పడింది. ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.2 కోట్ల కు పైగా ఉంటుంది. గతంలో ఇదే భూమిలో జగనన్న కాలనీలు మంజూరు చేశారు. అందుకు సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.78 లక్షలు ఖర్చు చేసి ప్లాట్లుగా చేసి సర్వేరాళ్లు కూడా బాతారు. అయితే వాటన్నింటినీ ప్రస్తుతం ఆక్రమణదారులు పీకేశారు. రెండు రోజులుగా పొక్లెయిన్‌లతో చిల్ల చెట్లు పీకేసి భూమిని చదును చేస్తున్నారు. రోజు రోజుకీ మండలంలో భూఆక్రమణ దారులు పెట్రేగి పోతున్నా ఇక్కడ రెవెన్యూ అధికారులు గానీ జిల్లా అధికారులు గానీ ఆక్రమణల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం. ఈ భూ ఆక్రమణ విషయమై తహశీల్దార్ జీ రజనీకుమారిని వివరణ కోరగా ఆక్రమణ విషయం తమకు తెలియదని వెంటనే వీఆర్వోను పంపి పరిశీలించి భూమిని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. ఆక్రమణదారులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



గతంలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసేందుకు ఈ భూమిని కేటాయించి ప్లాట్లు వేశారు. ఇప్పుడు భూమిని చదును చేసి ఎవరో ఆక్రమించుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు భూమి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి. భూమిలో ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు చేయాలి. యథావిధిగా ఆక్రమణదారులతో రాళ్లు బాతించి భూమిని స్వాధీనం చేసుకోవాలి.

– పోకూరి సుబ్బారావు చౌదరి

పీహెచ్‌సీ వైద్యుల మౌన ప్రదర్శన



డీఎంహెచ్ఓ కార్యాలయం బయట మౌన ప్రదర్శన చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

ఒంగోలు టౌన్: సర్వీస్ కోటాను 30 నుంచి 15 శాతానికి తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేస్తున్న పోరాటం కొనసాగుతోంది. శనివారం నగరంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం బయట పీహెచ్‌సీ వైద్యులు మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డా.రాహుల్ మాట్లాడుతూ న్యాయమైన ఇన్ సర్వీస్ కోటాపై ప్రాథమిక వైద్యుల పోరాటం కొనసాగుతుందని చెప్పారు. జీవో నంబర్ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టైం బౌండ్ ప్రమోషన్, ట్రైబల్ అలవెన్సుల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా కార్యదర్శి డా.ఖాదర్ మస్తాన్ బీ విజ్ఞప్తి చేశారు. మంగళవారం లోపు తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ ఆందోళనలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

24 నుంచి కళాశాల ఆటల పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పర్చూరు (చినగంజాం): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నిర్దేశించిన కళాశాలల్లో 19 ఏళ్లలోపు క్రీడాకారుల ఎంపిక ఈ నెల 24 వ తేదీ నుంచి జరుగుతుందని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఈదర చింపారెడ్డి శనివారం తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సింగరాయకొండలో ఈ నెల 24, 25 తేదీల్లో ఉదయం గం.10 నుంచి యోగ, ఫెన్సింగ్, చెస్, బాక్సింగ్, జూడో, కరాటే, మాల్కం, జిమ్నా స్టిక్స్, బీచ్ వాలీబాల్ పోటీల్లో ఎంపిక చేస్తారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కందుకూరులో ఈ నెల 26 న అథ్లెటిక్స్, 27 హాకీ, హ్యాండ్ బాల్, 28 క్రికెట్ పోటీల్లో ఎంపిక జరుగుతుందన్నారు. ఒంగోలు ఏబీఎం జూనియర్ కళాశాలలో ఈ నెల 27 వతేదీ మోడరన్ పెంటాథిలిన్, రబ్బీ, 28న సాఫ్ట్‌బాల్, షూటింగ్ బాల్, 29 న బేస్ బాల్, రీజినింగ్ పోటీలో ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు 9440621579 నంబరును సంప్రదించాలని కోరారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి 28 తుది గడువు

ఒంగోలు: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీలో ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 28 చివరి తేదీ అని ఏపీ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ చైర్మన్ డి.సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల కోఆర్డినేటర్లంతా తమ పరిధిలో విద్యార్థులకు విషయాన్ని తెలియజేసి ప్రవేశాల పెంపునకు కృషిచేయాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో ఈనెల 30 వరకు అడ్మిషన్ పొందవచ్చన్నారు.

నమ్మించి..వంచన



చౌటపాలెంలో వినాయక బొమ్మను నిమజ్జనం చేస్తున్న గ్రామస్తులు



గ్రామస్తులతో చర్చిస్తున్న ఇన్‌చార్జి ఎస్సై రమేష్‌బాబు

- చౌటపాలెంలో వినాయకుడి బొమ్మ నిమజ్జనం
- నిమజ్జనం చేస్తే కేసులు తొలగించి, బైక్‌లు ఇస్తామన్న పోలీసులు
- నిమజ్జనం చేసిన తరువాత ప్లేట్ ఫిరాయించిన ఎస్సై రమేష్‌బాబు
- తనకేమీ తెలియదు ఎస్పీని అడగండంటూ నిర్లక్ష్యపు సమాధానం
- పోలీసుల తీరుపై కోర్టును ఆశ్రయిస్తామంటున్న గ్రామస్తులు

పొన్నలూరు: మంత్రి స్వామి, స్థానిక టీడీపీ నాయకుల రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా మండలంలోని చౌటపాలెం గ్రామంలో వారం రోజులుగా వినాయకుడి బొమ్మ నిమజ్జనానికి నోచుకోలేదు. మంత్రి స్వామి ఆదేశించాడంటూ స్వామి భక్తి చాటుకున్న పోలీసులు తమ బాధ్యతలు మరిచి వారం రోజులుగా వినాయక బొమ్మ నిమజ్జనాన్ని అడ్డుకోవడంతో పూజలు అందుకోకుండా ఎండలోనే ఉండి పోయింది. అయితే వారి తీరుకు విసిగిన పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేసిన గ్రామస్తులు 33 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి వారి బంధువుల ట్రాక్టర్లు, బైక్‌లు సీజ్ చేశారు. ఈ క్రమంలో గురువారం పొన్నలూరు ఇన్‌చార్జి ఎస్సై రమేష్‌బాబు గ్రామస్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చర్చలు జరిపారు. వినాయక నిమజ్జనం జరగకపోవడం వలన ప్రభుత్వానికి, పోలీసులకు చెడ్డ పేరు వస్తుందని, వెంటనే నిమజ్జనం చేపట్టాలని గ్రామస్తులను కోరారు. దీంతో గ్రామస్తులు తమపై పెట్టిన అక్రమ కేసులు తీసివేయాలని, అలాగే నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనటానికి వచ్చిన తమ బంధువులపై పెట్టిన కేసులు కూడా ఎత్తివేసి వారి ట్రాక్టర్లు, బైక్‌లు విడుదల చేయాలని కోరారు. గ్రామస్తుల డిమాండ్లను ఒప్పుకున్న ఎస్సై రమేష్‌బాబు బొమ్మ నిమజ్జనం చేసిన మరుక్షణమే సీజ్ చేసిన వాహనాలను విడుదల చేసి కేసులు తొలగిస్తామని వాగ్దానం చేశారు.

ప్లేట్ ఫిరాయించిన పోలీసులు:

ఇదిఇలా ఉంటే ఇన్‌చార్జ్ ఎస్సై రమేష్‌బాబు గ్రామస్తుల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం వారం రోజులు తరువాత శనివారం గ్రామస్తులు వినాయక బొమ్మను నిమజ్జనం చేశారు. ఆ తరువాత పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తమకు ఇచ్చిన మాట ప్రకారం కేసులు తొలగించి సీజ్ చేసిన ట్రాక్టర్లు, బైక్‌లు విడుదల చేయాలని ఎస్సైను కోరారు. అయితే ఇన్‌చార్జి ఎస్సై రమేష్‌బాబు తన చేతిలో ఏమీలేదని మీరు ఉన్నతాధికారులను కలవండంటూ నిర్లక్ష్యపు సమాధానంతో ఉచిత సలహా ఇచ్చారు. దీంతో కంగుతిన్న గ్రామస్తులు తమకు ఇచ్చిన మాట తప్పి మోసం చేశారని, ఇది సరైన పద్ధతి కాదంటూ అసహనం వ్యక్తం చేశారు. మంత్రి చెప్పాడంటూ దేవుని విషయంలో అనవసరంగా తలదూర్చిన పోలీసులు గ్రామస్తులను అనేక విషయాల్లో ఇబ్బందులు పెట్టారని మహిళలు వాపోయారు. ఏ తప్పు చేయకపోయినా అక్రమ కేసులు బనాయించారని పోలీసుల తీరును దుయ్యబట్టారు.

కోర్టును ఆశ్రయిస్తామంటున్న గ్రామస్తులు:

వినాయక నిమజ్జనం విషయంలో గ్రామస్తులను అడ్డుకోవడమే కాక, 33 మందిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారు. ఈ క్రమంలో ప్రజల్లో తమపై వ్యతిరేకత వస్తుందని, తమ పరువు పోతుందంటూ పోలీసులు గ్రామస్తులతో చర్చలు జరిపారు. వారం రోజుల తరువాత వినాయక బొమ్మను నిమజ్జనం చేస్తే అక్రమ కేసులు తొలగించడంతో పాటు, సీజ్ చేసిన ట్రాక్టర్లు, బైక్‌లు విడుదల చేస్తామన్నారు. వినాయక బొమ్మను శనివారం నిమజ్జనం చేసిన తరువాత మాట మార్చడంతో గ్రామస్తులు ఆగ్రహించారు. పోలీసులు నమ్మించి మోసం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా వినాయక నిమజ్జనం విషయంలో పోలీసులు తీరుపై ఆధారాలతో కోర్టును ఆశ్రయిస్తామని, ప్రైవేట్ కేసు వేసి సంబంధిత వ్యక్తులకు శిక్షపడేలా పోరాటం చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

జల్సాల కోసం బైకు దొంగతనాలు

- ఆరుగురు ముఠాలోని ముగ్గురు బైకు దొంగల అరెస్ట్
- రూ.3.60 లక్షల విలువ చేసే ఐదు బైకులు స్వాధీనం
- మిగిలిన ముగ్గురి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ నాగరాజు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ సుబ్బారావు

మార్కాపురం: జల్సాలకు అలవాటుపడి డబ్బుల కోసం బైకులు దొంగతనం చేస్తున్న ఆరుగురు ముఠా సభ్యుల్లో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.3.60 లక్షల విలువైన 5 బైకులు స్వాధీనం చేసుకున్నారు. మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ యు.నాగరాజు ఆ వివరాలు వెల్లడించారు. నంద్యాలలోని లలితానగర్‌కు చెందిన పి.సుమంత్ ఈ నెల 14వ తేదీ మార్కాపురం పట్టణంలోని ఎస్‌సీబీసీ కాలనీలో నివాసం ఉంటున్న స్నేహితుడిని కలిసేందుకు బైక్‌పై వచ్చాడు. స్నేహితుడి ఇంట్లోకి వెళ్లి బయటకు వచ్చి చూడగా, బైక్ కనిపించకపోవడంతో మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ చోరీతో పాటు గతంలో దొంగతనానికి గురైన మోటార్ సైకిళ్ల కేసులు ఛేదించేందుకు ఎస్పీ దామోదర్, డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ బృందం దర్యాప్తు మేరకు శనివారం ఉదయం పట్టణ ఎస్సై సైదుబాబుకు అందిన సమాచారంతో పట్టణ శివార్లలోని నాగులవరం రోడ్డు చివర్లో ఈద్గా వద్ద అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. మార్కాపురం మండలం వేములకోట గ్రామ పంచాయతీలోని వేములపేట గ్రామానికి చెందిన కొత్రపోలు నాగార్జునరెడ్డిగా గుర్తించి మరింత లోతుగా విచారించారు. తాము మొత్తం ఆరుగురు ముఠా అని, మార్కాపురం, కంభం, గిద్దలూరు, కొనకనమిట్ల, చీమకుర్తి ప్రాంతాల్లో ఐదు బైకులు దొంగతనం చేశామని నాగార్జునరెడ్డి అంగీకరించాడు. ఆ ముఠాలోని మార్కాపురం మండలం నాగులవరం గ్రామానికి చెందిన తిరుమలకొండ ప్రేమ్‌కుమార్, మార్కాపురం పట్టణంలోని రామలక్ష్మణవీధికి చెందిన వగరుల దుర్గాప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి మొత్తం ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వాటి విలువ రూ.3.60 లక్షలు ఉంటుందని చెప్పారు. ముఠాలోని సయ్యద్ మాజీద్ అలియాస్ ఆసీఫ్, షణ్ముఖ్, శివ పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. వీరంతా జల్సాలకు అలవాటుపడి బైకు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. కంభంలో ఆగస్టు 31వ తేదీ రాత్రి, కొనకనమిట్లలో సెప్టెంబరు 16వ తేదీ, గిద్దలూరులో ఆగస్టు 31, చీమకుర్తిలో సెప్టెంబరు 12, మార్కాపురం టౌన్‌లో సెప్టెంబర్ 14న ఇళ్లముందు పార్కింగ్ చేసి ఉన్న మోటారు సైకిళ్లను వీరు దొంగతనం చేసినట్లు వివరించారు. అరెస్టు చేసిన ముగ్గురిని మార్కాపురం కోర్టులో హాజరుపరచగా.. మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని చెప్పారు. కేసులు ఛేదించడంలో ప్రతిభ చూపిన మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, పట్టణ ఎస్సై సైదుబాబు, ట్రైనీ ఎస్సై డాక్టర్ ఎం.రాజమోహన్‌రావు, కానిస్టేబుళ్లు కుర్రా వీరభద్రుడు, షేక్ షరీఫ్, డి.కోటినాయక్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు అందించినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ, పట్టణ ఎస్సై పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బైకులు

ఇసుక మాఫియాకు జీ హుజూర్

- దాడుల్లో దొరికిన నాలుగు టిప్పర్లు, ఒక పొక్లెయిన్
- స్వాధీనం చేసుకుంది మాత్రం ఒక టిప్పర్

ముండ్లమూరు(దర్శి): కంచే చేను మేస్తే కాపేమి చేయగలడు అన్న చందాన మైనింగ్ అధికారుల తీరు ఉంది. ఇసుక మాఫియాకు తలొంచి.. పట్టుకున్న నాలుగు వాహనాలు వదిలి ఒకదానినే స్టేషన్‌కు తరలించారు. ఈఘటన ముండ్లమూరు మండలంలోని పోలవరం చిలకలేరు వద్ద శనివారం సాయంత్రం జరిగింది. శనివారం ముండ్లమూరు మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారంతో జిల్లా మైనింగ్, విజిలెన్స్ అధికారులు చిలకలేరు ప్రాంతంలో దాడులు నిర్వహించి ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే వాస్తవానికి ఈ దాడుల్లో నాలుగు ఇసుక టిప్పర్లు, ఒక పొక్లెన్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా నియోజకవర్గ స్థాయి ప్రధాన టీడీపీ నాయకుడు మైనింగ్ అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో మూడు టిప్పర్లు, ఒక పొక్లైన్ వదిలేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాలతో దాడులకు వచ్చిన అధికారులు అసలు దొరకలేదని చెప్తే సదరు ఆదేశాలు బేఖాతర్ చేసినట్లు అవుతుందని భావించి ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చూపించారు. పట్టపగలు పోలీసు స్టేషన్ ఎదురుగా వందల సంఖ్యలో అక్రమ ఇసుక టిప్పర్లు తిరుగుతున్నా స్థానిక పోలీసులు పట్టించుకోక పోవడంతో మండల ప్రజలు వారి పనితీరు పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై టీడీపీ శ్రేణుల దాడి

ఒంగోలు టౌన్: ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దారి కాచి ఇనుపరాడ్లతో టీడీపీ శ్రేణులు దాడి చేసి గాయపరిచిన ఘటన కొండపి మండలం కండ్లగుంట గ్రామంలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం... కొండపి మండలంలోని కండ్లగుంట గ్రామానికి చెందిన రావూరి మాచర్ల సంతనూతలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుంటారు. ఆయనకు స్వగ్రామంలో కొంత పొలం ఉంది. అదే గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన సానుభూతిపరులైన సూరిశెట్టి రమణయ్య, ఆదెయ్య సోదరులు ఆ పొలాన్ని దున్నడంతో గతంలో కేసు పెట్టి ఉన్నారు. కక్ష పెంచుకున్న ఆక్రమణదారులు.. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో శనివారం ఉదయం పొలానికి వెళ్లి వస్తున్న మాచర్లను దారి కాచి ఇనుప రాడ్లతో తలపై కొట్టారు. అతనికి గాయాలవగా ఒంగోలు జీజీహెచ్‌కి తరలించి చికిత్స అందించారు. ఆ మేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ భవనం సత్యనారాయణ జీజీహెచ్ క్యాజువాలిటీలో చికిత్స పొందుతున్న మాచర్ల మాస్టర్‌ను పరామర్శించి దాడిని ఖండించారు. నిందితులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.


ఉపాధ్యాయుడిని పరామర్శిస్తున్న గ్రామ సర్పంచ్ సత్యనారాయణ

26 వేల కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ఒంగోలు టౌన్: ఇటీవల కాలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. రాష్ట్రం నుంచి పక్క రాష్ట్రాలకు దర్జాగా తరలిపోతోంది. అడపాదడపా విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నా రేషన్ మాఫియా పెద్దగా భయపడడం లేదు. నామమాత్రపు కేసులకు దడవడం లేదు. ఈ క్రమంలో టంగుటూరు మండలంలోని వల్లూరు గ్రామం సమీపంలో ఎన్‌హెచ్ 16పై విజిలెన్స్ అధికారులు దాడి చేసి తమిళనాడుకు చెందిన లారీని పట్టుకున్నారు. అందులో తరలిస్తున్న 26వేల కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని బ్రోకెన్ రైస్‌గా మార్చి గుంటూరు జిల్లా వడ్లమూడి గ్రామం నుంచి తమిళనాడుకు తరలిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. వడ్లమూడి గ్రామంలోని శ్రీలక్ష్మి శ్రీనివాస ట్రేడర్స్ మిల్లు నుంచి తమిళనాడులోని మధురైకి రవాణా చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. లారీలోని మొత్తం 520 బ్యాగుల బియ్యం, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఈడీటీ కృష్ణ మోహన్, సీఐ రాఘవరావు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని సింగరాయకొండ ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జికి అప్పగించినట్లు లారీని టంగుటూరు పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


విజిలెన్స్ అధికారుల దాడిలో పట్టుబడిన తమిళనాడుకు తరలుతున్న రేషన్ బియ్యం

మంజూరైన గృహాలు పూర్తి చేయాలి

- ఈ నెల 28న ప్రత్యేక గృహ నిర్మాణ కార్యక్రమం
- కలెక్టర్ తమీమ్ అన్సారియా


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో మంజూరైన గృహాలన్నీ పూర్తిచేయాలని, మన ఇల్లు.. మన గౌరవం పేరుతో ఈ నెల 28వ తేదీ ప్రభుత్వం ప్రత్యేక గృహ నిర్మాణ కార్యక్రమం చేపడుతోందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. శనివారం ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్‌తో కలిసి మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ ఈఈ, డీఈ, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద జిల్లాకు కేటాయించిన గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 కింద మంజూరైన ఇళ్లలో అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేసేందుకు ఈ నెల 28న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దీని ద్వారా సంబంధిత అధికారులంతా సమన్వయంతో పనిచేసి గృహ నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. 2025 మార్చి నాటికి ఇటువంటి నిర్మాణాలన్నీ పూర్తి కావాలని ఆదేశించారు. వంద రోజుల లక్ష్యం కింద జిల్లాలో 3,044 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, ఇప్పటి వరకు 345 నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలినవి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఇళ్లతో పాటు మరుగుదొడ్లు గ్రౌండ్ చేసి నిర్మాణాలు చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ మాధురి, డీపీఓ ఉషారాణి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు వసుంధర, రవికుమార్, మైన్స్ డీడీ జగన్నాథరావు, వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యువజనోత్సవాల విజేతలు వీరే..

ఒంగోలు: జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక క్విస్ కాలేజీలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాల విజేతల వివరాలను స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ శనివారం మీడియాకు విడుదల చేశారు. వివిధ విభాగాలలో తొలి మూడు స్థానాలలో నిలిచిన వారి వివరాలు వెల్లడించారు. వీరిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి యువజనోత్సవాలో పాల్గొంటారని తెలిపారు.

జానపద నృత్యాలు గ్రూప్ : ఆర్‌జేయూకేటీ గ్రూప్ (ప్రథమ), రాజేష్ గ్రూప్ (ద్వితీయ), ఆంధ్రా అమ్మాయిలు (తృతీయ)

జానపద నృత్యాలు సోలో : జి.దుర్గాభవాని (ప్రథమ), పి.శ్రీజ (ద్వితీయ), కె.యాషిక ప్రియదర్శిని (తృతీయ)

జానపద గీతాలు గ్రూప్ : భాగ్యశ్రీ గ్రూప్ (ప్రథమ), లక్ష్మీమౌనిక గ్రూప్ (ద్వితీయ), టి.ఝాన్సీ గ్రూప్ (తృతీయ)

జానపద గీతాలు సోలో : వై.గ్రేస్ మత్రి (ప్రథమ), ఉమేష్ చంద్ర (ద్వితీయ), టి.సృజనతార (తృతీయ)

స్టోరీ రైటింగ్ : ఎస్.వెంకట్రావు (ప్రథమ), జె.గ్లాడిస్ రాచెల్ (ద్వితీయ), ఎస్‌వీ అవినాష్ (తృతీయ)

డిక్లమేషన్: డి.వంశీ (ప్రథమ), టి.ఝాన్సీ రామతులసి (ద్వితీయ), డి.పెర్సిస్ (తృతీయ)

పొయెట్రీ : డి.శ్రీనిధి (ప్రథమ), జి.సంతోష్‌కుమార్ (ద్వితీయ), సీహెచ్ మేఘన (తృతీయ)

పెయింటింగ్ : ఎస్‌కే అఫ్సాన (ప్రథమ), ఎస్.మౌనిక (ద్వితీయ), ఎ.మోహన్ నిరంజన్ (తృతీయ)

వైజ్ఞానిక ప్రదర్శన : ఎస్.రవిశ్రీశంకర్ (ప్రథమ), ఎం.హర్షిత (ద్వితీయ), ఎస్.అనిల్‌కుమార్ (తృతీయ)

హ్యాండీ క్రాఫ్ట్ : సీహెచ్ వీఎస్ఎం ఆషాజ్యోతి (ప్రథమ), కె.లలితాంబిక (ద్వితీయ), టి.ఝాన్సీ రామతులసి (తృతీయ)

ఒంగోలులో ఫ్లెక్సీల రగడ


జనసేన కార్యకర్తలు ఏర్పాటు చేసిన బాలినేని ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఒంగోలు టౌన్: జిల్లా కూటమి పార్టీల్లో ఫ్లెక్సీల రగడ రేగింది. వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఇటీవల పవన్‌కళ్యాణ్‌ను కలిసిన తరువాత జనసేనలో చేరనున్నట్లు ప్రకటించడం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి బాలినేని అభిమానులు కొందరు నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫొటో కూడా పెట్టారు. దామచర్ల ఫొటో చిన్నది పెట్టి అవమానించారని తెలుగుయువత ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో మున్సిపల్ సిబ్బందిని పిలిపించి ఫ్లెక్సీలను తొలగించారు. ఇకముందు దామచర్ల విలువను తగ్గించేలా ఎలాంటి చర్యలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. బాలినేని ఫ్లెక్సీలను తొలగించడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

తలకెక్కిన మత్తు

- మద్యం తాగి భార్య, అమ్మ, కోడలిపై దాడి

మార్కాపురం: మద్యం మత్తులో భార్య, అమ్మ, కోడలు వరుసయ్యే మహిళపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు శనివారం తెలిపారు. పట్టణ శివార్లలోని కరెంటు ఆఫీసు వెనుక ముదిరాజ్ కాలనీలో నివాసముండే చిత్తలూరి ఏడుకొండలు పూటిగా మద్యం సేవించాడు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో మద్యం మత్తులో తన భార్య వెంకట లక్ష్మి, తల్లి చిత్తలూరి గాలెమ్మ, కోడలు వరుసయ్యే అరుణపై కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం జీజీహెచ్‌కు అనంతరం ఒంగోలుకు తరలించినట్లు తెలిపారు.

వీఆర్‌లో ఉన్న ఎస్సైలకు పోస్టింగులు

ఒంగోలు టౌన్: జిల్లాలో వీఆర్‌లో ఉన్న పలువురు ఎస్సైలకు పోస్టింగులిస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న టి.త్యాగరాజు, పి.శివనాగరాజు, జి.సుబ్రహ్మణ్యంలను ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. షేక్ అబ్దుల్ రెహమాన్, ఎం.శివనాంచారయ్యలను ఒంగోలు టూటౌన్‌కు బదిలీ చేశారు. ఏవీ సుబ్బారావును డీసీఆర్బీతో పాటు టూటౌన్‌కు అటాచ్ చేశారు. వి.హరిబాబు, జి.సందీప్‌లను ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎండీ ఫిరోజ్, ఎం.అనితలను పీసీఆర్‌తో పాటు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు అటాచ్ చేశారు. కె.శ్రీనివాసరావును డీసీఆర్బీతో పాటు తాలూకా పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేశారు. పుల్లలచెరువులో విధులు నిర్వర్తిస్తున్న పి.రాజేష్‌ను పీసీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎల్.సంపత్ కుమార్‌ను పుల్లలచెరువుకు, ప్రభాకరరెడ్డిని గిద్దలూరుకు, వి.వెంకటేశ్వరరావును డీసీఆర్బీ ఒంగోలుకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీ మహిళా ఉద్యోగిపై లైంగికదాడికి యత్నం?

మార్కాపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండులో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఒక మహిళ ఉద్యోగిపై డిపోలో పనిచేస్తున్న ఒక డ్రైవరు రెండురోజుల క్రితంలైంగిక దాడి యత్నం చేసినట్లు తెలిసింది. ఈ సంఘటన ఆర్టీసీ ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారితీసింది. మార్కాపురం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే సర్వీసుల్లో ఒక డ్రైవరు.. మహిళా ఉద్యోగిపై లైంగికదాడికి ప్రయత్నించగా ఆమె గట్టిగా ప్రతిఘటించడంతో డ్రైవర్ పరారయ్యాడు. యూనియన్‌ల ఆధిపత్యం మధ్య ఈ విషయం బహిర్గతమైంది. నిందితుడు ఒక ప్రధాన యూనియన్ సభ్యుడు కావడం గమనార్హం. ఈ విషయమై మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు వివరణ కోరగా తనకు రాతపూర్వకంగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా ఈ సంఘటన ఈనెల 18వ తేదీ నూతన బస్సులు ప్రారంభించిన తరువాత మధ్యాహ్న సమయంలో జరిగినట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి


మృతుడు దాసరి మాలకొండయ్య

కనిగిరి రూరల్: తెగిపడిన బోర్ సర్వీస్ వైర్‌ను కటింగ్ ప్లేయర్‌తో జాయింట్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురైన గొర్రెల యజమాని మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని నేలటూరి గొల్లపల్లి సచివాలయ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని నేలటూరి గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి మాలకొండయ్య ఉదయం సుమారు 6 గంటల సమయంలో తన గొర్రెల దొడ్డి వద్ద పనిముగించుకుని ఇంటికి వెళ్లేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో గ్రామ సచివాలయం సమీపంలో ఉన్న బోర్ వద్దకు వెళ్లి కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు బోర్ మోటార్‌ను ఆన్ చేయగా నీళ్లు రాలేదు. విద్యుత్ స్తంభం నుంచి బోర్‌కు సరఫరా అయ్యే సర్వీస్‌వైర్ తెగిపడి ఉండటాన్ని గమనించారు. దీంతో కటింగ్ ప్లేయర్‌తో తెగిపడిన సర్వీస్‌వైర్‌ను జాయింట్‌చేసే క్రమంలో పొరపాటున విద్యుత్‌వైర్ తగిలి విద్యుదాఘాతంలో మలకొండయ్య (44) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని కుమారుడు దాసరి మహేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై టి.శ్రీరాం ఘటన తీరుపై వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.